న్యూజెర్సీ కథల పోటీలో మూడవ బహుమతి (రూ.1500/– ) పొందిన కథ



"అమ్మా" కొడుకు పిలిచేడు.

"నాయనా, మల్లేశూ, అన్నం తిందు గాని రామ్మా"

మంగమ్మ చేతి ముద్దలు మల్లేశు గొంతులో ఒక్కొక్కటి దిగి వాడి చిన్ని కడుపులోని ఆకలి ప్రపంచాన్ని తునా తునకలు చేస్తున్నాయి.

"అమ్మా మంగమ్మ తల్లీ..."

'ఎవడాడు? ముష్టి అడుక్కుంటూ రోడ్డు మీద వింత ప్రాణిలా దొర్లుతూ బొచ్చెతో, దుబ్బు జుట్టుతో వస్తున్న ఈడికి నా పేరెట్లా తెల్సింది' అనుకుంది మంగమ్మ.

అయితే ఆ సంగతి వాడిని అడగలేదు.

"నా కన్న తల్లి పేరు మంగమ్మ తల్లీ... అందుకే ఆ పేరే నా పెదాల మీద ఆడుతూ వుంటాది. చిన్నప్పుడే దూర లోకానికి వెళ్ళిపోయిందమ్మా నాయమ్మ..."

అంత నీరసంలోనూ వివరణ ఇచ్చాడు బిచ్చగాడు.

"రైళ్ళు పట్టాల మీద నడుస్తాయి. మనిషి రోడ్డు మీద నడుస్తాడు. నువ్వేంట్రా రోడ్డు మీద పాకుతున్నావ్?"

"ఆకలికి తట్టుకోలేక పురుగై పుట్టానమ్మా" అన్నాడు సిగ్గుతో తలను భూమి లోకి దించుకుంటూ...

"ఇదిగోరా ఈ అన్నం తిను"

మంగమ్మ వాడికి అన్నం పెట్టింది. అంతలో నిద్దరొచ్చింది. వాళ్ళకున్న చిన్ని అరుగు మీద అలానే నిద్దరోయాడు.

"అమ్మా వాడెవడమ్మా"

మల్లేశు అడిగేడు.

"వాడు బిచ్చగాడ్రా నాయనా... అందర్నీ అడుక్కుంటాడు. మంచి హృదయం కలవాళ్ళు వాణ్ణి ఆదుకుంటారు"

"నేను కూడా అడుక్కుంటానమ్మా"

"తప్పు బాబూ అలా అనకూడదు"

"అడుక్కునేవాళ్ళకి అన్నం పెట్టొచ్చా అమ్మా"

"అడిగినవాళ్ళకి పెట్టాలి..."

మల్లేశు చిన్ని చేతులతో బిచ్చగాణ్ణి లేపుతూ– "ఒరే బిచ్చగాడా– లేవరా లేచి నన్ను అన్నం పెట్టమని అడుగు. పెడతాను..."

మల్లేశు మాటలకు మంగమ్మకు ఆశ్చర్యంతో కూడిన నవ్వు వచ్చింది.

* * *

బిచ్చగాడు ఎప్పటికో లేచాడు.

"అమ్మా– అన్నం పెట్టమ్మా"

మంగమ్మని అడిగేడు.

"లేదురా"

"పెట్టవా తల్లీ..."

"అన్నం పెట్టను... అలా చెట్టు నీడకి పద..."

ఎందుకు? లాంటి ప్రశ్న వాడి కళ్ళల్లో తిరిగింది.

వాడి చూపులో కామమనే ఎర్రటి జీర...

ఆమె కోపంగా చూసింది.

వాడు మొదటి మాటకు వచ్చేడు.

"అమ్మా అన్నం పెట్టమ్మా"

"పదరా... చెట్టు కిందికి..."

ఆ ఇద్దరూ నడుస్తుంటే మల్లేశు అనుసరించేడు.

"ఇప్పుడెలా వుందిరా..."

"చల్లగా వుందమ్మా."

ఒక కాయ కోసి ఇచ్చి తినమంది.

"ఎలా వుందిరా–"

"ఆకలి తీరిపోయిందమ్మా... తాగడానికి నీళ్ళు కావాలి"

బిచ్చగాడు కొత్త కోరికని వెక్కిళ్ళ రూపంలో వెలిబుచ్చుతున్నాడు.

"దాహం తల్లీ.... ఇన్ని నీళ్ళు..."

ఆమె మాట్లాడడం లేదు.

మల్లేశు– నీళ్ళు మింగుతున్నాడు.

"దాహం... దాహం..."

అయినా ఆమె మాట్లాడడం లేదు.

తల్లికి చెవుడెప్పుడొచ్చిందబ్బా అని మల్లేశు ఆశ్చర్యపోయాడు.

"అమ్మా నీళ్ళంట..."

మల్లేశు రికమెండేషనూ అక్కడ దూది పింజలా ఎగిరిపోయింది.

"నీళ్ళివ్వకుండా నన్ను చంపేస్తావా అమ్మా..." గట్టిగా అరిచేడు.

# అతడూ... అన్నంముద్దా...



ఆ అరువుకి అటు పది మైళ్ళూ, ఇటు పది మైళ్ళూ దూరాన వున్న ప్రతి చిన్ని నీటి చుక్కా ప్రతిధ్వనించి వుండాలి.

"అదిగో అటు చూడు.."

## అడబాల వి.వి. సత్యనారాయణ

చూశాడు.

"వాళ్ళు నీళ్ళను ఎంతో దూరం నుండి మోసుకొస్తున్నారు. వెళ్లు..."

అమ్మ ఆదేశించింది.

వాడు అయోమయంగా అటు వెళ్ళాడు.

నేను కూడా వెళ్తానమ్మా అన్న మల్లేశుని చంకన ఎత్తుకుంది.

"వాడిని వెళ్ళనీరా మల్లేశూ..." అంది.

అందరి చంకల్లోనూ నెత్తుల మీదా కావిళ్ళలోనూ ఒకో బిందెనూ, కుండనూ, అన్నిటిని కలగలిపి అందర్నీ కరిగిస్తూ నీళ్ళకి ప్రార్థించేదు వాడు.

"ఎవరూ ఇవ్వలేదమ్మా"

బిచ్చగాడు ఫిర్యాదు చేశాడు.

"అదిగో ఆ నెత్తిమీద నాలుగైదు ఒకదానిమీద మరొకటి పేర్చుకుని నడవలేక నడుస్తోంది చూడు. అక్కడికెళ్లరా..." అంది.

"వెళ్ళేనమ్మా. ఆమె కూడా ఈయలేదు"

మళ్ళీ మరో నీరస సమాధానం.

"అలాక్కాదు... ఆమెను కాస్సేపు అనుసరించు... అంటే వెనకాతల నడు..."

"ఏయ్ ఎవర్నువ్వు... అంటూ నన్ను గద్దించిందమ్మా..."

బిచ్చగాడు మళ్ళీ తిరిగొచ్చేసేదు.

"అలా క్కాదు. 'నీ నెత్తి మీద అంత భారం వుంది కదా. కొంత బరువు నా నెత్తి మీద పెట్టు' అని అడుగు..."

అలాగే అడిగేదు.

ఆమె అంగీకరించింది...

ఆమె ఇచ్చిన నీళ్ళు త్రాగి మళ్ళీ ఎప్పటి చెట్టు కిందికి వచ్చేదు.

"ఏమైందిరా..."

"ఆమె నీళ్ళిచ్చిందమ్మా..."

"మంచిది. అలాగే అందరికీ పని చేసి పెట్టు. అన్నీ ఇస్తారు..."

మల్లేశూ... మంగమ్మా ఇంటికి నడిచేరు.

వాడు చెట్టుకిందే ఆలోచిస్తూ వుండిపోయేడు...

* * *

వాడీసారి నిటారుగా నడుస్తూ వచ్చాడు.

"అమ్మగారూ" అన్నాడు.

మల్లేశు వాళ్ళమ్మతో చెప్పాడు.

"నీ గొంతు మారిందిరా."

మంగమ్మ మెచ్చుకుంది.

"నా పేరు కూడా గుర్తొచ్చిందమ్మా"

"అలాగా. భలే..."

"భలే భలే..." మల్లేశు చప్పట్లు కొట్టేడు.

"అందరికీ అన్నీ చేసిపెడుతున్నావా? అలా పెడితేనే ఎవరేనా ఏదేనా పెడతారు..."

గతం మాట తన మాటల్లో గుర్తు చేసింది.

"గంగకు మాత్రమే చేశాను. చేస్తున్నాను. చేసినందుకు ప్రేమ పుట్టిందమ్మా..."

"పెళ్ళి పుట్టలేదేంట్రా"

మంగమ్మ నవ్వింది.

మల్లేశు రెండు చేతులూ అమ్మ మెడకు లంకె వేశాడు. వాడి వీపు మీద దబదబా రెండు కొట్టి ముద్దు పెట్టింది. వాడు చేతిలోని కర్రను విరిచాడు. మరిచిపోయిన జేబులోని బెల్లం ముక్కను 'బుగ్గ'కు అందించాడు.

"వస్తానమ్మా"

"నీ పేరేమిట్రా"

"పెద్ద మల్లేశు"

వాడు వెళ్ళినవైపే ఆలోచించింది.

చినుకులు దారిని తడుపుతున్నాయి.

"అమ్మా- వానా వానా వల్లప్పా- పాఠం అప్పచెబుతానమ్మా"

"ఇంటికెళ్ళేక-"

మంగమ్మా- మల్లేశూ చినుకులై కురుస్తూ ఇంటికి చేరుకున్నారు.

* * *

"అమ్మా"

మల్లేశు గొంతులో "గంగ" గొంతూ మిళితమై పలికింది.

"పెళ్ళి చేసుకున్నారా మీ ఇద్దరూ..."

మంగమ్మకు వయస్సు కాస్త ఎక్కువైనా గొంతు బానే పలికింది.

"అవునమ్మా- ఇదుగో- ఈడు నా కొడుకు."

అని చేతిలో పెట్టాడు.

మల్లేశు వాడి వంక కాస్త గర్వంగానూ కాస్త ఆదోలానూ చూస్తూ ముత్తానికి పరిశీలిస్తున్నాడు.

"ఈడు నీ కొడుకేనమ్మా..."

"ఏమిట్రా..."

"అదంతేనమ్మా. ఇది నా మొదటి ప్రసాదం... నువ్వే తీసుకో. ఆ రోజున అన్నం ముద్ద పెట్టి వదిలెయ్యలేదు. చెట్టుకాడికి తీసుకెళ్ళి ప్రకృతికి అర్థం చెప్పేవు... నీళ్ళ బిందెల మధ్యకు వదిలి సహకారానికి అలవాటు చేసి ప్రేమ అంత ఎత్తు పెంచావు. పెళ్ళి అయి ఇప్పుడు బిడ్డకి తండ్రినీ అయ్యాను. బ్రతుక్కి అర్థం చెప్పిన నీకు నా రక్తాన్ని ఇస్తున్నానమ్మా.

"వీడికి నువ్వేమీ చెయ్యొద్దు. అసలు నువ్వేమీ చెయ్యొద్దు. అన్నీ ఈడే చేస్తాడు. వాడి కడుపుకు ఇంత అన్నం పెట్టు చాలమ్మా" అంటూ సజల నయనాలతో చేతులు జోడించాడు.

గంగా నమస్కరించింది.

మంగమ్మ కళ్ళు వర్షించాయి.

ఒక చెయ్యి ఎత్తుగా మల్లేశు చేతి మీద వేసి రెండో చేతిలో ఆ పసిబిడ్డ తల నిమురుతుంటే దేవతలు కూడా 'మాతృదేవోభవ...' అనుకుని తృప్తిగా కళ్ళుమూసుకున్నారు. ☆